సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 26 । నవంబర్ । 2023



పోస్టల్ బ్యాలెట్‌లో గందరగోళం

ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్లు లేవని చెప్పడంతో గందరగోళం నెలకొంది. 6లో



ప్రజాస్వామ్యంపై దాడి

దేశంలో ప్రజాస్వామ్యంపై తీవ్రమైన దాడి జరుగుతోందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. 6లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసంతో పాటు వారాంతపు సెలవులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.


నిడుదవోలులో...

భద్రాచలంటౌన్ : ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు వనకరమిల్లిలో భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

డిసెంబర్‌లో సైన్స్‌ఫేర్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ పోటీలు డిసెంబర్ మూడో వారంలో పాల్వంచలో జరుగుతాయని, ఇందుకోసం విద్యార్థులను సిద్ధం చేయాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసారి సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ అనే అంశంపై సైన్స్ ఫేర్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యం, జీవన విధానం–పర్యావరణం, వ్యవసాయం, కమ్యూనికేషన్–ట్రాన్స్‌పోర్ట్, కంప్యూటర్ థింకింగ్, అనే అంశాల ఆధారంగా సైన్స్ ఎగ్జిబిట్స్ రూపొందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల విద్యార్థులు 3 నుంచి 5 ప్రదర్శనలు తీసుకురావాలని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను కార్యోన్ముఖులను చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. 2022 – 23 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో 85 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, ఒక్కో విద్యార్థికి రూ.10 వేల చొప్పున మంజూరయ్యాయని, ఆ నగదు నేరుగా విదార్థుల ఖాతాలో జమవుతాయని వివరించారు. ఎవరి ఖాతాలో అయిన జమ కాకుంటే తిరిగి వారి బ్యాంకు వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులు అప్‌లోడ్ చేసిన ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో రెండు సెట్లు రూపొందించుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు(9247296012)ను సంప్రదించాలని తెలిపారు.

కేటీపీఎస్ 7వ దశను సందర్శించిన జెన్‌కో డైరెక్టర్



ప్లాంట్‌లో పరిశీలిస్తున్న డైరెక్టర్ లక్ష్మయ్య, అధికారులు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ 7వ దశ కర్మాగారాన్ని శనివారం టీఎస్ జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బాదావత్ లక్ష్మయ్య సందర్శించారు. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12వ యూనిట్‌లోని కోల్ ప్లాంట్, వ్యాగన్ టిప్లర్, ట్రాక్ అఫర్, మెయిన్ సెంట్రల్ రూంలను ఆయన పరిశీలించారు. బొగ్గు సరఫరా, నిల్వపై ఆరా తీసిన ఆయన విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఇన్‌చార్జ్ సీఈ గుర్రం రాజ్‌కుమార్, ఎస్‌ఈలు ఎస్.యుగపతి, ఎం.శ్రీనివాస్, ఏడీఈ వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టికెట్ల విక్రయాలు

భద్రాచలంటౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో నిర్వహించే ఉత్తర ద్వార దర్శన టికెట్ల విక్రయాలు కొనసాగుతున్నాయని ఈఓ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు వీఐపీ టికెట్లు 700కు 167, సెక్టార్–ఏ 300కు 93, సెక్టార్–బీ 650కి 72, సెక్టార్– సీ 100కు 100, సెక్టార్– డీ 100కు 10, సెక్టార్ – ఈ 500కు 92 టికెట్లను భక్తులు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్నారని వివరించారు.

ప్రియాంక రాక.. కాంగ్రెస్‌లో కేక



నాయుడుపేట వద్ద అభివాదం చేస్తున్న ప్రియాంకా గాంధీ, పక్కన పొంగులేటి, భట్టి, తుమ్మల



ఖమ్మంలో ప్రియాంకగాంధీ రోడ్‌షోకు హాజరైన జనం (ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న ప్రియాంకాగాంధీ



మధిర సభలో మాట్లాడుతున్న ప్రియాంకాగాంధీ, పక్కన భట్టి విక్రమార్క

రోడ్‌షోలు, విజయభేరి సభకు తరలివచ్చిన జనం

- నృత్యం, కోలాటాలతో భారీ స్వాగతం
- మధిర విజయభేరి సభలో ఎక్కువ సేపు ప్రసంగం
- భట్టి, పొంగులేటి, తుమ్మల, రాగమయి సహా అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకాగాంధీ రాకతో ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఎన్నికల ప్రచారం చివరి అంకాన కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించిన రోడ్‌షోలు, మధిరలో నిర్వహించిన విజయభేరి సభకు పార్టీ శ్రేణులు, ప్రజలతోపాటు ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలు హాజరయ్యారు. భారీ ర్యాలీతో ప్రియాంకాగాంధీ నిర్వహించిన రోడ్‌షో, మధిరలో ఏర్పాటు చేసిన విజయభేరి సభ ఆద్యంతం పార్టీలో జోష్ నింపింది. హైదరాబాద్ నుంచి శనివారం మధ్యాహ్నం 12.15 గంటలకు హెలీకాప్టర్‌లో సర్దార్ పటేల్ స్టేడియానికి చేరుకున్న ఆమె.. ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో రోడ్‌షోలో పాల్గొనడంతోపాటు మధిరలో నిర్వహించిన సభకు హాజరయ్యారు. పార్టీ అభ్యర్థులు భట్టి, పొంగులేటి, తుమ్మల, మట్టా రాగమయితో పాటు ఇతరులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ రావాలని నినదించండి

'కేసీఆర్ మీకు ఉద్యోగాలు ఇచ్చాడా..? కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి, ఉద్యోగాలు కావాలంటే బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపండి'. అని ఆమె పెదతండా వద్ద పార్టీ శ్రేణులను ద్దేశించి పిలుపునిచ్చారు. ఇకనైనా 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అంటూ పార్టీ శ్రేణులతో నినాదాలు చేయించారు. పెదతండాలో పార్టీ కార్యకర్త కూతురిని ఎత్తుకుని లాలించారు. ఖమ్మం, పెదతండా, నాయుడుపేట, కల్లూరులో రోడ్‌షోలలో దారి పొడవునా ఉన్న పార్టీ శ్రేణులు, ప్రజలకు అభివాదం చేస్తూ కదిలారు.

శ్రీనివాసరెడ్డి, భట్టి, తుమ్మలను గెలిపించాలి..

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల రోడ్‌షోల్లో పాల్గొన్న ప్రియాంక పెదతండా వద్ద మాట్లాడారు. పాలేరు, ఖమ్మం, మధిర అభ్యర్థులైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్కలను గెలిపించాలని పిలుపునిచ్చారు. దీంతో పార్టీ కార్యకర్తలు జై కాంగ్రెస్, జై ప్రియాంక అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

సత్తుపల్లిని జిల్లాగా ప్రకటిస్తాం..

కల్లూరులో జరిగిన రోడ్‌షోలో ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ సత్తుపల్లికి మట్టా రాగమయి, దయానంద్ మంచి పనులు చేశారని, ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాగమయిని గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సత్తుపల్లిని జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఓట్ల కోసం చాలామంది వస్తారని, ప్రజలు ఆలోచించి మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు.

ప్రజల కోసం భట్టి పాదయాత్ర..

మధిరలో ఏర్పాటుచేసిన విజయభేరి సభలో ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ జోడో యాత్ర మాదిరిగానే తెలంగాణలో ప్రజల కోసం భట్టి విక్రమార్క పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో భట్టి సభకు పోతున్నానని తన తల్లి సోనియాగాంధీతో చెప్పానని, ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల కలలు నెరవేరుతాయని, బలమైన ప్రభుత్వం ఏర్పడుతుందని తన తల్లి ఇక్కడి ప్రజలకు చెప్పమని తెలిపిందన్నారు. ప్రజా సమస్యలపై తాను, తన సోదరుడు పోరాటం చేస్తున్నామని తెలిపారు. మధిరకు రావడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. పాదయాత్ర చేసినందుకు భట్టిని అభినందించిన ప్రియాంక.. మధిర సభలో అర గంటకు పైగా ప్రసంగించారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం..

ఇటీవల మణుగూరులో రాహుల్‌గాంధీ, ప్రస్తుతం ప్రియాంకగాంధీ ప్రచారంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. అగ్రనేతల పర్యటనలకు శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున హాజరు కావడంతో గెలుపుపై పార్టీ అభ్యర్థులు. ధీమా వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన మూడు రోజులు ప్రచారాన్ని ఉధృతంగా నిర్వహించేలా అభ్యర్థులు, పార్టీ ముఖ్యనేతలు దృష్టి సారించారు. కాంగ్రెస్ మద్దతుతో కొత్తగూడెంలో బరిలో ఉన్న సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు ప్రచారంలోనూ ఆ పార్టీ నాయకులే కాక కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఇక రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ రోడ్‌షోలకు కాంగ్రెస్‌తోపాటు సీపీఐ, టీడీపీ శ్రేణులు కూడా తరలివచ్చాయి. రోడ్‌షోలు, సభలో పార్టీ అభ్యర్థులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ మట్టా రాగమయి, నేతలు పోరిక బలరాం నాయక్, పోట్ల నాగేశ్వరరావు, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, మట్టా దయానంద్, పొంగులేటి ప్రసాదరెడ్డి, తుమ్మల యుగంధర్, తుంబూరు దయాకర్‌రెడ్డి, సాధు రమేష్‌రెడ్డి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావెద్, కమర్తపు మురళి, వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, ఎం.డీ.ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

అగ్రనేతకు అపూర్వ స్వాగతం

సర్దార్ పటేల్ స్టేడియంలో హెలీకాప్టర్ దిగిన ప్రియాంకాగాంధీకి పార్టీ నేతలు భట్టి, పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు జిల్లా నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆమె జెడ్పీసెంటర్‌కు చేరుకున్న ఆమె ప్రచార రథం ఎక్కి ర్యాలీగా జెడ్పీసెంటర్, వైరారోడ్, పాత బస్టాండ్, కాల్వొడ్డు మీదుగా నాయుడుపేట బ్రిడ్జి వరకు చేరుకున్నారు. ఖమ్మం నగరంలోని పార్టీ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలకగా, పాలేరు నియోజకవర్గ శ్రేణులు నాయుడుపేట వద్ద స్వాగతించారు. గిరిజన మహిళలు, ఆదివాసీల నత్యాలు, కోలాట బృందాలతో సందడి నెలకొనగా... గిరిజన మహిళలను ప్రియాంక ప్రచారరథం పైకి పిలిపించి వారితో కలిసి నృత్యం చేశారు. నాయుడుపేట, పెదతండా మీదుగా వరంగల్ క్రాస్‌రోడ్డు వరకు భారీ ర్యాలీ కొనసాగగా, అక్కడ ప్రియాంక మాట్లాడారు.

మధిర గేటు కూడా తాకలేరు..

మధిర: వంద మంది కేసీఆర్‌లు వచ్చినా మధిర గేటును కూడా తాకలేరని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో జరిగిన విజయభేరి బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మధిర పోరాటాల గడ్డ అని, కేసీఆర్ ఇటీవల పాల్గొన్న సభలో భట్టి విక్రమార్క గెలవడని చెప్పాడన్నారు. కానీ ఎంత మంది వచ్చినా తన గెలుపును అడ్డుకోలేరని.. ఈసారి 50 వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడితే ప్రజలకు మంచి జరుగుతుందని భావిస్తే బీఆర్‌ఎస్ పాలనలో ఎవరికీ మేలు జరగకపోగా ఆ పార్టీ నాయకులే బాగుపడ్డారని తెలిపారు. దొరల తెలంగాణకు, ప్రజల తెలంగాణకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని 78 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని భట్టి తెలిపారు.

పోరాడేవారికే పట్టం కట్టాలి

త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్



మాట్లాడుతున్న మాణిక్ సర్కార్

భద్రాచలంఅర్బన్ : ప్రజా సమస్యలపై పోరాడే వారినే చట్టసభకు పంపించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ పిలుపునిచ్చారు. సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్యకు మద్దతుగా శనివారం ఆయన భద్రాచలంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ప్రజలను విభజించి పాలించాలని చూస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీకి బీఆర్‌ఎస్ సర్కార్ బీటీంగా వ్యవహరిస్తోందని, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టేనని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆదివాసీలపై దాడులు పెరిగాయన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేలుగా పనిచేసిన సున్నం రాజయ్య, కుంజా బొజ్జి మచ్చలేని పాలన అందించారని గుర్తుచేశారు. కొత్త పెన్షన్ స్కీమ్‌తో ఎవరికీ ఉపయోగం లేదని, పాత పెన్షన్ స్కీమ్‌నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరోసారి పాలించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కాలేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు వైద్య సేవలు అందడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, ఎలమంచిలి రవికుమార్, ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, మర్లపాటి రేణుక, సున్నం గంగా, బి.రమేష్, వెంకటరెడ్డి, శరత్ బాబు, వెంకట రామారావు పాల్గొన్నారు.

జిల్లాకు అదనంగా 500 ఈవీఎంలు



ఈవీఎం గోదాంలో పరిశీలిస్తున్న ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాకు అదనంగా 500 ఈవీఎంలను కేటాయించారని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శనివారం ఆమె ఈవీఎం గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా నుంచి 300, ఖమ్మం నుంచి 200 యూనిట్లు జిల్లాకు చేరుకున్నాయని చెప్పారు. వాటిని తనిఖీ చేసి నియోజకవర్గాలకు పంపిస్తామని తెలిపారు. రిజర్వ్‌డ్‌తోపాటు ఈవీఎంలు అవసరమైన నియోజకవర్గాలకు వినియోగించేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. ఈసీఐఎల్ ఇంజనీర్లు తనిఖీ చేసిన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పటిష్ట భద్రత మధ్య ఈవీఎం గోదాంలో భద్రపర్చినట్లు వివరించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు రజాక్, సలీం, సంతోష్ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: భారత రాజ్యాంగం పట్ల ప్రతి పౌరుడు బాధ్యతగా నడుచుకోవాలని, దానిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజల మధ్య ఐక్యత, సమానత్వం ఉండేందుకే బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం సోదర భావం గురించి రాజ్యాంగం తెలియజేస్తుందని చెప్పారు. సమావేశంలో కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ. సుచరిత, కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డి.రమేష్, వి.పురుషోత్తంరావు, న్యాయవాదులు లక్కినేని సత్యనారాయణ, అనుబ్రోలు రాంప్రసాదరావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ



Interview

అభివృద్ధే గెలిపిస్తుంది

కొత్తగూడెం అర్బన్: వనమా వెంకటేశ్వరరావు.. జిల్లాలో పరిచయం అక్కర్లేని సీనియర్ పొలిటీషియన్. 40 ఏళ్ల క్రితం వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి మంత్రి స్థాయి వరకు ఎదిగిన నాయకుడు. పదవిలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజలతో మమేకమయ్యే లీడర్. గతంలో నాలుగు సార్లు కొత్తగూడెం నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఎన్నికల ముందు అనేక పేర్లు తెర పైకి వచ్చినా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన నమ్మకాన్ని వనమాపైనే పెట్టారు. దీంతో ఐదోసారి బరిలో నిలుస్తున్నారు. తన హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయనే ధీమాతో ఉన్న కొత్తగూడెం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు శనివారం 'సాక్షి'తో పలు విషయాలు పంచుకున్నారు. అవి ఆయన మాటల్లోనే..

నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో పనులు

- మెడికల్, నర్సింగ్ కళాశాలలు తీసుకొచ్చా
- బీఆర్‌ఎస్ హయాంలో సంక్షేమానికి పెద్దపీట
- ఎన్నికలప్పుడే కనిపించే వారిని ఎవరూ నమ్మరు..
- కొత్తగూడెం బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు

ప్రజల కోసం తలుపులు తెరిచే ఉంటాయ్..

కొత్తగూడెం నియోజకవర్గం నాకు కొట్టిన పిండి. ఎన్నికలప్పుడే కాదు, నిత్యం ప్రజల మధ్యనే ఉండే వాడిని. ఇక్కడి ప్రజల కోసం నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. నియోజకవర్గంలోని ఊర్లే కాదు ప్రతీ గడప, అందులో ఉన్న కుటుంబ సభ్యులు కూడా నాకు తెలుసు. అయినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ రాగానే దాదాపు అన్ని ప్రాంతాల్లో ప్రచారం చేశా. ప్రస్తుతం కొత్తగూడెం పట్టణంలోని వార్డుల్లో కొనసాగుతోంది. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే నా గెలుపునకు బాటలు వేస్తాయి.

వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చా..

నియోజకవర్గంలో రూ.3,000 కోట్లతో అభివృద్ధి పనులు చేశాను. మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయించా. దీంతో ఏజెన్సీలోని సామాన్య విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించా. రూ.135 కోట్లతో కొత్తగూడెం మున్సిపాలిటీకి నీటి సరఫరా పథకం, రూ.10 కోట్లతో చింతల చెరువుపై మినీ ట్యాంక్ బండ్, 800 మెగావాట్లతో కేటీపీఎస్ ఎక్స్‌టెన్షన్, ఐదు రెసిడెన్షియల్ పాఠశాలలు, గుడిపాడు, పేటచెరువుల మధ్య బ్రిడ్జి, సింగభూపాలెం చెరువు అభివృద్ధి వంటి అనేక పనులు చేశా. అన్ని గ్రామాలకు రోడ్లు, వాగులపై వంతెనలు మంజూరు చేశాం. వానాకాలంలో కూడా ఎలాంటి చింతా లేకుండా రాకపోకలు సాగించొచ్చు.

అభివృద్ధిని పరుగులు పెట్టించాం..

నియోజకవర్గంలో ఐదేళ్లలో అభివృద్ధిని పరుగులు పెట్టించా. ముర్రేడు వాగు కోత నుంచి పట్టణానికి రక్షణ కల్పించేందుకు కోట్ల రూపాయల వ్యయంతో రక్షణ గోడ మంజూరు చేయించా. ప్రతీ గ్రామానికి, ప్రతీ వీధికి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. రైల్వే, సింగరేణి కారణంగా వనమా నగర్, మాయాబజార్ తదితర ఏరియాల్లో ఇళ్లు కోల్పోయిన వారందరికీ ఇళ్ల స్థలం మంజూరు చేయించి పట్టాలు పంపిణీ చేశా. ఆ తర్వాత గృహలక్ష్మినీ వర్తింపజేశాం. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చాం. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు, రైతుబంధు అమలుతో పాటు పోలీసు కేసులు ఎత్తి వేయించాను.

మళ్లీ గెలుపు నాదే..

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరింది. ప్రజలు ఆశీర్వదించి మళ్లీ గెలిపిస్తారనే విశ్వాసం ఉంది. కేసీఆర్ సభ, కేటీఆర్ రోడ్ షోతో గెలుపుపై మరింత నమ్మకం వచ్చింది. మెజార్టీ ఎంత అనేది డిసెంబర్ 3న తెలుస్తుంది. కారు గుర్తుకు ఓటేయాలని ఇప్పటికే అంతా నిర్ణయించుకున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఉన్న నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారు.

నాకు దీటైన అభ్యర్థులెవరూ లేరు..

ప్రస్తుతం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల్లో నాతో సమానంగా పోటీకి వచ్చే వారెవరూ లేరు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి పోయే వారిని ప్రజలు నమ్మరు. గతంలో భూముల్లో బోర్డులు పెట్టిన గుర్తులు ఇంకా మిగిలే ఉన్నాయి. మళ్లీ అలాంటి వారికి ఓటేసి కష్టాలు కొని తెచ్చుకునేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. పొత్తులంటూ పోటీలో ఉన్న అభ్యర్థికి కేడర్ లేదు, గుర్తు అందా లేదు. దీంతో ఇతర పార్టీల లీడర్లు, కేడర్ బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారు. తద్వారా మా బలం రెట్టింపైంది.

జాతీయస్థాయి ప్రదర్శనలో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

అశ్వాపురం: ఝార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడాలో ఈ నెల 21, 22వ తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న 30 అణుశక్తి పాఠశాలలకు సంబంధించి సైన్స్, సోషల్, గణితం, టీచింగ్ ఎయిడ్స్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఇందులో సైన్స్ విభాగం నుంచి అశ్వాపురంలోని అణుశక్తి కేంద్రీయ విద్యాలయం 9వ తరగతి విద్యార్థి కెన్నీ నీహాల్ ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతి సాధించాడు. ఆయనకు ఎస్కార్ట్‌గా సుస్మిత మహాపాత్రా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని శనివారం ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రావుతోపాటు రుక్మాంగధరావు, సంజయ్ భూయే తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతకు రశీదు ఇస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్న దాన కార్యక్రమానికి ఏపీకి చెందిన భక్తులు శని వారం విరాళం అందజేశారు. తెనాలికి చెందిన కమలకుమారి రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈఓ రమాదేవికి అందజేశాక స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికా రులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రుగొండ యువతికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ప్రశాంతి

చంద్రుగొండ: చంద్రుగొండకు చెందిన తలారి ప్రశాంతి విజయవాడలోని కేఎల్ విశ్వవి ద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకుం ది. స్టాటిస్టిక్స్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తిచేసిన ఆమెకు విజయవాడలోని యూనివర్సిటీలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో పట్టా ప్రదానం చేశారు. బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి తలారి అంతోని – రాణి దంపతుల కుమార్తె అయిన ప్రశాంతి స్థానికంగానే ప్రాథమిక విద్య పూర్తిచేసింది. ఆమె డాక్టరేట్ అందుకోవడంతో గ్రామస్తులు పలువురు అభినందించారు.

కర్ణాటకలో నెరవేరని హామీలు

ఇల్లెందు: కర్ణాటకలో అధికారంలోకి వచ్చేం దుకు కాంగ్రెస్ శుష్కవాగ్దానాలు చేసిందని... ప్రభుత్వం ఏర్పాటుచేసి ఆరు నెలలైనా ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలు చేయలేదని కర్ణాటకలోని బళ్లారి విధాన పరిషత్ సభ్యుడు ఎం.వై సతీష్ వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఆయన శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఇల్లెందు బీజేపీ అభ్యర్థి డి.రవీంద్రనాయక్‌తో కలిసి మాట్లాడారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీ స్కీంలు అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రె స్ ఏ పథకాన్నీ సక్రమంగా అమలు చేయటం లేదని తెలిపారు. మళ్లీ తెలంగాణలో ఎన్నికల వేళ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలు ప్రవేశపెడ తామని చెబుతుండగా, ప్రజలు నమ్మొద్దని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ అభ్యర్థి రవీంద్రనాయక్, నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశం వాయిదా

చుంచుపల్లి: జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈఓ.ఎం.విద్యా లత ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల బిజీ షెడ్యూల్‌లో భాగంగా అధికారు లు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కాలేకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొ న్నారు. ఎన్నికల అనంతరం తిరిగి ఎప్పుడు సమావేశం నిర్వహించేది వెల్లడిస్తామని తెలిపారు.

మెచ్చా ప్రచార రథంపై దాడి

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ప్రచార రథంపై ఓ యువకుడు దాడికి పాల ్పడ్డాడు. అశ్వారావుపేట బస్టాండ్ సెంటర్‌లో మెచ్చా నాగేశ్వరరావు శనివారం రోడ్ షో నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ ఇక్కడ ఇద్దరు దొంగలున్నారు.. మా బావ గెలిచినా.. ఓడినా.. మేమిద్దరం వాళ్ల సంగతి తేలుస్తాం.. వదిలేదే లేదని పేర్కొన్నారు. ఆ తర్వాత బస్టాండ్ సెంటర్ నుంచి పేటమాలప ల్లి వెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు జూపల్లి రమేష్‌బాబు నివాసం వద్దకు ప్రచార రథం చేరుకోగానే.. అనిల్ కృష్ణ అనే యువ కుడు బీఆర్ఎస్ నాయకులు కలపాల శ్రీను చేతిలోని మైక్ లాక్కుని ఏయ్.. మెచ్చా.. ఏం చేశావని వచ్చావ్.. అంటూ కేకలు వేస్తూ, ప్రచార రథాన్ని పలుమార్లు తన్నాడు. దీంతో రథానికి ఉన్న కేటీఆర్ సైన్‌బోర్డ్ పాక్షికంగా ధ్వంసమైంది. కాగా యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు చెక్ పోస్టు వద్ద శనివారం తనిఖీలు చేపట్టిన పోలీసులు అక్రమంగా తరలిస్తున్న ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వరంగ ల్‌కు చెందిన దాసరి సాయి భద్రాచలం నుంచి ఇల్లెందు మీదుగా వరంగల్‌కు బైక్‌పై గంజాయి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిం దితుడి నుంచి ఆరు కిలోల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సైదారవూఫ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

ఇంతింతై.. రూ.40 లక్షలై!

నలభై రెట్లు పెరిగిన అసెంబ్లీ ఎన్నికల వ్యయం

- తొలి ఎన్నికల్లో రూ.లక్ష మాత్రమే గరిష్ట పరిమితి
- ప్రతీ రూపాయికి లెక్క పక్కాగా ఉండాల్సిందే..



భద్రాచలం అర్బన్: శాసనసభ ఎన్నికల సమరంలో డబ్బు కీలకపాత్ర పాత్ర పోషిస్తుందన్నది ఎవరూ కాదనలేని అంశం! అయితే, ఎన్నికల నియమావళి ప్రకారం బరిలో నిలిచిన అభ్యర్థులు ఇష్టారీతిన డబ్బు ఖర్చు పెట్టడానికి వీలులేదు. ప్రస్తుత నిబం ధనలు అనుసరించి వ్యయపరిమితి గరిష్టంగా రూ. 40 లక్షలుగా నిర్ణయించారు. అయితే ఈ వ్యయ పరిమితి తొలినాళ్లలో రూ.లక్ష మాత్రమే ఉండగా ఇంతింతై వటుడింతై అన్నట్లు ఇప్పుడు రూ.40క్ష లకు చేరింది. 1952లో జరిగిన తొలి ఎన్నికల నుం చి చూస్తే నలభై రెట్లు పెరిగినట్లయింది.

నామినేషన్ రోజు నుంచే లెక్క

2014 అసెంబ్లీ ఎన్నికల సమయాన అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.28 లక్షలుగా ఉండేది. ఇక లోక్ సభ ఎన్నికల వ్యయ పరిమితిని రూ.95 లక్షలుగా నిర్ణయించారు. నామినేషన్ వేసిన రోజు నుంచి పోలింగ్ జరిగే వరకు అభ్యర్థి చేసే ప్రతీ ఖర్చును ఎన్నికల వ్యయంగానే పరిగణిస్తారు. అయితే, పార్టీ తరఫున జరిగే సభల ఖర్చును అభ్యర్థి ఖాతాలోకి తీసుకోరు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులు చేసే ఖర్చులన్నీ ప్రత్యేక బ్యాంకు ఖాతా ద్వారానే నిర్వ హించాలి. అందుకోసం నామినేషన్ దాఖలు చేసే నాటికి కొత్త అకౌంట్ ప్రారంభించాలి. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు లేదా ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు ఎలాంటి ఖర్చు చేయరాదని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. తనిఖీల్లో పట్టు బడిన నగదు, ఇతర సామగ్రి ఎవరైనా అభ్యర్థిదని తేలితే ఆ అభ్యర్థుల వ్యయంలో చేరుస్తారు. రోజువారీగా అభ్యర్థులు చేసే వ్యయంతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లు, టోపీలు, కండువాలు, భోజనాలు, వాహనాల అద్దె, ఇంధన ఖర్చులు, సభా వేదికలు, మైకులు, పత్రిక లు, టీవీ, సోషల్ మీడియా ప్రకటనలకు చేసే ఖర్చులను కలిపి అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కి స్తారు. వీటిలో ప్రతీదానికి బిల్లు సమర్పించాలి. అం తేకాక ఎన్నికల సంఘం నిర్దేశించిన ధరల ఆధారం గా లెక్కలు పరిగణనలోకి తీసుకుంటారు.

పెరుగుతున్న వ్యయపరిమితి

1952 సాధారణ ఎన్నికల సమయాన అభ్యర్థుల వ్యయపరిమితి రూ.లక్షగా ఉండేది. ఇది 1962 నాటికి రూ.3లక్షలకు, 1971 ఎన్నికల్లోరూ.4లక్ష లకు, 1975 నాటికి రూ.5 లక్షలు చేరింది. 1984లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా రూ.10 లక్షలకు చేరగా... 1991 నాటికి రూ.12లక్షలకు పెంచారు. ఆతర్వాత 1999లో రూ.15 లక్షలు, 2004 నాటికి రూ.17 లక్షలు, 2009లో రూ.26 లక్షలు, 2014లో రూ.28 లక్షల వ్యయపరిమితిని నిర్ణయించారు. ఇది ప్రస్తుత ఎన్నికల్లో రూ.40 లక్షలకు చేరుకుంది. కాగా, ఎన్నికల సంఘం అభ్యర్థుల ఖర్చును రూ.40ల క్షలుగా నిర్దేశించిన అంతకు మించి ఎన్నో రెట్లు ఖర్చవుతోందని ప్రస్తుత ప్రచారం తీరును చూస్తే అర్థమవుతోందని పలువురు చెబుతున్నారు.

రాజకీయాల్లో 'జలగం' ముద్ర!

- ఆ కుటుంబం నుంచి చట్టసభల్లోకి నలుగురు
- జెడ్పీ చైర్మన్ మొదలు సీఎం పదవి వరకు పదవులు
- హ్యాట్రిక్ విజయాలతోనూ రికార్డులు

సత్తుపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాదు రాష్ట్రం లోనూ జలగం వెంగళరావు పరిచయం అక్కరలేని పేరు. ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి, హోంమంత్రి, జిల్లా పరిషత్ చైర్మన్.. ఇలా చెబుతూ పోతే ఎన్నో పదవులు అలంకరించి జిల్లా రాజకీయాలపై ఆయన చెరగని ముద్ర వేశారు. తద్వారా జలగం కుటుంబం ఉమ్మడి జిల్లాలో అందరికీ సుపరిచిత మనే చెప్పాలి. డీసీసీబీ చైర్మన్ నుంచి ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్, పంచాయితీరాజ్ మంత్రి తదితర పదవులను ఈ కుటుంబంలోనే నేతలు నిర్వర్తించారు. జలగం వెంగళరావు సహా కొండలరావు, ప్రసాదరావు, వెంకటరావు ఆ కుటుంబం నుంచి ప్రాతినిధ్యం వహించారు.

జలగం వెంగళరావు



జలగం వెంగళరావు తొలిసారి 1959లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నిక య్యారు. అలాగే, 1962లో వేంసూరు(ప్రస్తుత సత్తుప ల్లి) నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై వరుసగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. 1969లో కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో హోంమం త్రిగా పనిచేశారు. ఆతర్వాత 1973 డిసెంబర్ 10న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 1978మార్చి వరకు కొనసాగారు. ఆ సమయాన దేశంలో ఎమర్జె న్సీ విధించడంతో కాంగ్రెస్ పార్టీ చీలిపోగా, జలగం వెంగళరావు ఇందిరాగాంధీతో విభేధించి కాంగ్రెస్(ఆర్)ను స్థాపించారు. 1978 ఎన్నికల్లో గెలుపొం దినా రాష్ట్రంలో 30సీట్లకే పరిమితం కావడంతో రాజీనామా చేసి క్రియాశీలక రాజకీయాలకు దూర మయ్యారు. అయితే, అప్పటి ప్రధాని ఇందిరాగాం ధీ హత్యానంతరం రాజీవ్‌గాంధీ ఆహ్వానం మేరకు తిరిగి కాంగ్రెస్‌లో చేరి 1986లో ఖమ్మం ఎంపీగా గెలిచి కేంద్ర పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు నిర్వ ర్తించారు. 1989లోనూ ఖమ్మం ఎంపీగా రెండోసారి గెలిచిన వెంగళరావు రాజకీయాల నుంచి విరమిం చుకోగా, 1999జూన్ 12న కన్నుమూశారు.

జలగం కొండలరావు



జలగం వెంగళరావు కుటుంబం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిం ది ఆయన సోదరుడు జలగం కొండలరావు. 1957లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఒకసారి, ఖమ్మం ఎంపీగా వరుసగా రెండుసార్లు గెలిచారు.

జలగం వెంకటరావు



జలగం కుటుంబం నుంచి మూడో తరం నాయకుడిగా జలగం వెంకటరావు రాజకీయ అరంగ్రే టం చేశారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో తొలి ప్రయత్నంగానే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో పున ర్విభజనతో సత్తుపల్లి ఎస్సీలకు రిజర్వ్‌డ్ కావ డంతో ఖమ్మం అసెంబ్లీ స్థానికం కాంగ్రెస్ టికెట్‌ను ఆశించినా దక్కకపోవడంతో ఇండి పెండెంట్‌గా పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2014లో కొత్తగూడెం అసెంబ్లీ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఉమ్మడి జిల్లాలో టీఆర్ఎస్ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. ఇక 2018 ఎన్నికల్లోనూ కొత్తగూ డెం టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినా ఓడిపో యారు. ప్రస్తుతం కొత్తగూడెం నుంచే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా వెంక టరావు పోటీలో ఉన్నారు.

జలగం ప్రసాదరావు



1983లో ఎన్టీఆర్ ప్రభం జనాన్ని తట్టుకుని సత్తుపల్లి ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచిన ప్రసాదరావు జలగం కుటుంబం సత్తాను చాటారు. 1984లో అసెంబ్లీ రద్దుతో మధ్యంతర ఎన్నిక లు జరగగా ఆయన పోటీచేయలేదు. మళ్లీ 1989లో పోటీచేసి విజయం సాధించారు. పంచాయతీరాజ్ శాఖమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి మంత్రివర్గం లో పనిచేశారు. 1994లో ఓడిపోయిన ఆయన, 1999లో ఖమ్మం ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పటి నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ జలగం ప్రసాదరావు మద్దతు కోసం రాజకీయ పార్టీల నాయకులు ఆయన చుట్టూ ప్రదక్షణలు చేస్తుంటారు. కాగా, 1983వరకు ఆయన డీసీసీబీ చైర్మన్‌గానూ పనిచేశారు.

ఈవీఎంలో అభ్యర్థి ఫొటో

- ఈసారి నుంచి అమలు చేస్తున్న ఎన్నికల సంఘం
- గతంలో అభ్యర్థుల గుర్తులు మాత్రమే..



సుజాతనగర్: ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా సాగేలా కేంద్ర ఎన్నికల సంఘం తగిన మార్పులు చేస్తోంది. గతంలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేవారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈ వీఎం)లను వాడుతున్నారు. ఈవీఎంల వినియోగం ప్రారంభమైన కొంతకాలానికి వాటికి ఓటర్ వెరిఫిల్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీప్యాట్) యంత్రాలను జోడించారు. ఈసారి ఎన్నికల్లో ఈవీఎంలలో అభ్యర్థికి కేటాయించిన గుర్తుతో పాటు సదరు అభ్యర్థి ఫొటోలు కూడా ఉండేలా చర్యలు తీసుకున్నారు. బ్యాలెట్ యూనిట్‌పై గతం లో అభ్యర్థి పేరు, అతనికి కేటాయించిన గుర్తు మాత్రమే ఉండేది. ఈసారి అభ్యర్థి ఫొటో కూడా ఉండనుండటం తో ఓటరు గుర్తు విష యంలో ఇబ్బంది పడ్డా, అభ్యర్థి ఫొటో చూసి ఓటు వేసుకోవచ్చు.

సరికొత్తగా అమలు..

ఈసారి ఈవీఎంలలో ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ లేదా స్వతంత్ర అభ్యర్థుల గుర్తుతోపాటు అభ్యర్థి ఫొటో కూడా ఉంటుంది. ఓటర్లకు ఒక వేళ గుర్తు అర్థం కాకపోయినా పక్కనే ఉన్న ఫొటో ఆధారంగా తేలికగా గుర్తించి, తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయొచ్చు.

–ఆర్.శిరీష, కొత్తగూడెం రిటర్నింగ్ అధికారి

రూ.4.50 లక్షలు స్వాధీనం



కారును తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తగూడెంటౌన్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లెం దు క్రాస్ రోడ్డు వద్ద ఐదు కార్లను ఆపి తనిఖీ చేసి, ఆధారాల్లేకుండా రూ.4,50,000 నగదు తరలిస్తు న్నట్లు గుర్తించా రు. దీంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీం హెడ్ బి.దేవదాస్ రాథోడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీజ్

భద్రాచలంఅర్బన్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు బెల్ట్‌షాపు లపై దాడులు చేస్తున్నారు. పట్టణం లోని లంబాడీ కాలనీ, ఇండ్రస్టీయల్ ఏరియా ప్రాం తాల్లో శనివారం దాడి చేసి రూ. 32 వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. ఇద్దరు బెల్ట్ షాపుల నిర్వా హకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

'పోస్టల్ బ్యాలెట్'లో గందరగోళం

శిక్షణకు వచ్చిన ఉపాధ్యాయులకు బ్యాలెట్ లేదని చెప్పడంతో ఆందోళన



పోస్టల్ బ్యాలెట్ కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు

ఇల్లెందు: ఎన్నికల విధులు కేటాయించిన ఉపా ధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహణలో గం దరగోళం నెలకొంది. ఇల్లెందు గురుకులం వద్ద శనివారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్య క్రమం తలపెట్టారు. అక్కడే పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కూడా కల్పించారు. దీంతో ఇల్లెందు, టేకులపల్లి మండలాలతో పాటు ములుగు, పాలకుర్తి, మహబూబాబాద్, గూడురు, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, పాఖాల కొత్త గూడెం తదితర ప్రాంతాల నుంచి సుమారు 600 మంది ఉపాధ్యాయులు ఇల్లెందుకు వచ్చారు. కానీ ఇల్లెందు, టేకులపల్లి మండ లాలకు చెందిన సుమారు 200 మందికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తామని ఇక్కడి రిటర్నింగ్ అధికారులు తెలపటంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. ఆర్డర్ కాపీలో ఇల్లెందులో పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని చెప్పడంతో వచ్చామని, తీరా ఇక్కడికి వచ్చాక లేవంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ సందర్భం గా ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల అధికారి జె.కాశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిన అందరికీ పోస్టల్ బ్యాలెట్‌లు అందు తాయని, ఎవరూ ఆందోళన పడొద్దని తెలిపారు. కాగా పోస్టల్ బ్యాలెట్ గందరోళం నేపథ్యంలో శిక్షణ కార్యక్రమం కూడా అసంపూ ర్తిగానే సాగింది.

మణుగూరులో 205 పోస్టల్ బ్యాలెట్లు..

మణుగూరు టౌన్/మణుగూరురూరల్: ఎన్నికల సిబ్బంది శనివారం మణుగూరు మం డల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఇతర నియోజకవర్గా ల్లో ఎన్నికల విధులు కేటాయించిన పినపాక అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన సుమారు 205మందితోపాటు కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల సిబ్బంది కూడా ఓటు వేశారు. ఈ మేరకు పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, రాఘవరెడ్డి వివరాలు వెల్లడించారు. కో ఎడ్యుకేషన్ పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎం, వీవీప్యాట్ల కమీష నింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కాగా పాలేరు, మధిర, ఖమ్మం నియోజకవర్గాల అధికారులు కూడా ఎన్నికల విధుల శిక్షణకు వచ్చారు. అయితే వారికి సంబంధించిన బ్యాలెట్ షీట్ పేపర్లు రాకపోవడంతో కొంత గందరగోళానికి గురయ్యారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ



తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

పాల్వంచ: ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు భారీగా నగదు నిల్వ ఉంచారనే సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ శనివారం రాత్రి సోదాలు చేపట్టింది. పట్టణంలోని జ్యోతినగర్ సమీపంలో గల జయ కళాశాల, ఆ పక్కనే ఉన్న బీఆర్ఎస్ నేత ముత్యాల రమ ణమూర్తి ఇంటికి కార్లలో భారీ మొత్తంలో నగదు తెచ్చి ఉంచారని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందింది. దీంతో సంబంధిత అధికారి భాస్కర్ రావు, పట్టణ ఎస్ఐ బి.రాము ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణం, గదులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రమణమూర్తి ఇంట్లో గదులన్నీ అర్ధరాత్రి వరకు సోదా చేశారు. అయితే ఎక్కడా నగదు పట్టుబడలేదని ఫ్లయిం గ్ స్క్వాడ్ అధికారి భాస్కర్ రావు తెలిపారు.

పెళ్లయిన నెల రోజులకే..

- వరకట్న వేధింపులతో గడ్డిమందు తాగిన నవ వధువు
- చికిత్స పొందుతూ మృతి

గుండాల: భర్త, అత్త, మామ మానసిక, వరక ట్న వేధింపులకు తాళలేక ఓ వివాహిత పురు గుల మంది తాగి శనివారం మృతి చెందింది. ఎస్సై రతీష్ కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండ లం తిర్లాపురం గ్రామానికి చెందిన జోగా విక్రమ్ ఆళ్లపల్లికి చెందిన ప్రసిల(24) ప్రేమిం చుకున్నారు. నెల రోజుల క్రితమే వివాహం చేసుకున్నారు. అయితే భర్తతోపాటు అత్తామా మలు కట్నం తేవాలని, కులాంతర వివాహం చేసుకున్నావంటూ ప్రసిలను వేధింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈ నెల 18న పంటచేనులో ఉన్న గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆళ్ల పల్లి పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశా లకు 108లో తరలించారు. అయినా ఆరోగ్యం కుదుటకపోవడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలిం చి చికిత్స అందించారు. అప్పటికీ నయంకాక పోవడంతో ఖమ్మం నుంచి కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో వైద్యు లు డయాలసిస్ చేయగా, ఆరోగ్యం కుదుట పడింది. డాక్టర్ల సూచనల మేరకు శుక్రవారం తల్లిదండ్రులు ప్రసిలను ఆళ్లపల్లిలోని తమ ఇంటికి తీసుకెళ్లారు. అదే రోజు సాయంత్రం మళ్లీ అనారోగ్య సమస్యలు తలెత్తగా, వెంటనే కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం 5 గం టలకు మృతి చెందింది. మృతురాలి కుటుం బీకుల ఫిర్యాదు మేరకు భర్త విక్రమ్, మామ వెంకన్న, అత్త లక్ష్మిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాస్వామ్యంపై దాడి

- పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చలే లేవు
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో ప్రజాస్వా మ్యంపై తీవ్రమైన దాడి జరుగుతోందని సీపీ ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఖమ్మంలో 'ప్రజాస్వామ్యం ఎన్నికలు – సీపీఎం వైఖరి' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదకర స్థితిలోకి తీసుకొచ్చారని, కొత్త చట్టాలతో మైనార్టీలపై దాడులు చేయిస్తున్నారని ఆరోపిం చారు. ప్రశ్నించే వారిని జైళ్లకు పంపిస్తున్నారని చెప్పారు. దేశం ఆర్థికంగా బాగుందని మోదీ చెబుతున్నా జీడీపీలో షేర్ చూస్తే ఎంత లోటు ఉందో తెలుస్తుందన్నారు. బీజేపీయేతర రాష్ట్రా లకు బకాయిలు చెల్లించడం లేదని, గవర్నర్లతో ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చలు జర గడం లేదని అన్నారు.

బీజేపీని గద్దె దించడమే లక్ష్యం

ఖమ్మంరూరల్: కేంద్రంలో మతోన్మాద బీజేపీని కేంద్రంలో ఓడించడమే మార్క్సిస్టు పార్టీల లక్ష్యమని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. పాలేరు సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని ఆకాం క్షిస్తూ ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంక టాయపాలెంలో శనివారం రాత్రి నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చే ముందు ఉపాధి, ఉద్యోగాలు అంటూ హామీలు ఇచ్చిన బీజేపీ ఆతర్వాత అన్నింటినీ విస్మరించిందని ఆరోపించారు. రైతుల రుణాలు మాఫీ చేయకపోగా కార్పొరేట్ శక్తు లకు మాత్రం రూ.లక్షల కోట్ల అప్పులు మాఫీ చేసిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటే తమ్మినేని వీరభద్రాన్ని గెలిపించాలని కోరారు. సీపీఎం పాలేరు, ఖమ్మం అభ్యర్థులు తమ్మినేని వీరభద్రం, యర్రా శ్రీకాంత్, నాయకులు బి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.